ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | 5



ప్రజలు ఆందోళన చెందవద్దు..



ప్రజలు ఆందోళన చెందవద్దు. వైరస్ వ్యాప్తి చెందకుండా అధికార బృందం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. అధికారులు శానిటేషన్ ప్రక్రియ చేపట్టారు. కొద్ది రోజుల పాటు గ్రామస్తులు చికెన్, గుడ్లు తినవద్దు.పరిస్థితిని బట్టి ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. - కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి

వసతి గృహాల విద్యార్థుల వైద్య సేవలకు యాప్

కలెక్టర్ మహేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు అత్యవసరంగా ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఐసీఐసీఐ లాంబార్డు సంస్థ మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు, చైల్డ్‌కేర్ సెంటర్ల నుంచి చదువుకుంటున్న విద్యార్థులకు అత్యవసర సమయంలో ఉచిత వైద్యసేవలు అందిస్తారన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం లాంబార్డు సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించడానికి అభివృద్ధి చేసిన మొబైల్ యాప్‌ను ఏవిధంగా వినియోగించాలో అనే అంశంపై జిల్లాలోని సాంఘిక, వెనుకబడిన తరగతుల వసతిగృహాల సంక్షేమాధికారులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు విద్యార్థులు నాన్ క్వాలిఫైడ్ వైద్యుల వద్దకు వెళుతుండడంతో వారు సరైన వైద్య పద్ధతులు పాటించకపోవడంతో అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. 1970 నుంచి 2000 సంవత్సరం వరకు సరైన స్టెరిలైజేషన్ పద్ధతులు పాటించకపోవడంతో జిల్లాలో హెపటైటిస్-సి బాగా వ్యాప్తి చెందిందన్నారు. ఆరోగ్య బీమా పరిధిలోకి వచ్చే విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే దగ్గరలో ఉన్న క్వాలిఫైడ్ వైద్యులు ఉన్న ఆసుపత్రులకు మాత్రమే తీసుకువెళ్లాలని సూచించారు. విద్యార్థులు ఉన్న ప్రాంతాలకు సమీపంలోని ఆసుపత్రులను, నర్సింగ్ హోమ్‌లను మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి పి.సత్యరమేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూకి.. చికెన్!

కోళ్లకు వైరస్.. ఆందోళనలో జనం

అయ్యో పాపం



తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో బర్డ్ ఫ్లూతో చనిపోయిన కోళ్లను గోతిలో పాతిపెడుతున్న యజమానులు



- కానూరులో నిర్ధారణ
- 62 వేల కోళ్లు మృతి
- 10 రోజులుగా మృత్యువాత
- యజమానుల సమాచారం
- స్పందించిన కాకినాడ సిబ్బంది
- భోపాల్ లేబోరేటరీకి శాంపిల్స్
- ఆదివారం ధ్రువీకరణ
- చికెన్ మార్కెట్ ఢమాల్
- అప్రమత్తమైన అధికారులు

రాజమహేంద్రవరం/ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చూస్తుండగానే కోళ్లు మృత్యువాతపడుతున్నాయి..ఉన్నట్టుండి తలలు వాల్చేస్తున్నాయి..కొన్ని కోళ్లు అయితే కొట్టుకుని చచ్చిపోతున్నాయి. నిన్నటి వరకూ కోళ్లతో కళకళలాడిన కోళ్ల ఫారాలు ప్రస్తుతం శ్మశానాన్ని తలపిస్తున్నాయి.ఎందుకంటే చనిపోయే కోళ్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా ప్రజల్లో ఆందోళన పెరిగింది. నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని రామకృష్ణా పౌల్ట్రీలో కోళ్లకు బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1) వైరస్ సోకింది.ఇది ఏవీఎన్ ఇన్‌ఫ్లూయేంజాలో ఒకరకం. ఆ గ్రామంలో ఉన్న మూడు ఫారాల్లో మొత్తం 64 వేల కోళ్లు ఉండగా ఇప్పటికే సుమారు 62 వేలు చనిపోయాయి.కానూరు అగ్రహారంలో ఈ నెల ఒకటో తేదీ నుంచే కోళ్లు చనిపోతున్నట్టు అధికారులకు సమాచారం వచ్చింది.ఈ మేరకు కాకినాడకు చెందిన లేబోరేటరీ సిబ్బంది వచ్చి పరీక్షించి 83 శాంపిల్స్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రం బోపాల్ ఉన్న నేషనల్ హైసెక్యూరిటీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబోరేటరీకి పంపించారు.వీటిని మూడు రకాలుగా పంపించారు. మూడు చనిపోయిన కోళ్ల శాం పిల్స్, 40 కోళ్ల ముక్కు టెస్ట్, మరో 40 కోళ్ల రెట్ట శాంపిల్స్‌ను పంపించారు. చనిపోయిన మూడు కోళ్లలో రెండు కోళ్లకు బర్డ్ ఫ్లూ ధ్రువీ కరణ అయింది.ఈ మేరకు ఆదివారం సాయంత్రం రిపోర్టు పంపారు.మిగతా శాంపిల్స్ ఫలితాలు రావాల్సి ఉంది. సుమారు 10 రోజులుగా బర్డ్ ఫ్లూ అనే ప్రచారం జరిగినా పౌల్ట్రీ రైతులు, పశు సంవర్థక శాఖాధికారులు పట్టించుకోలేదు.దీంతో పరిస్థితి ఇంత వరకూ వచ్చింది.విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పశు సంవర్థక సిబ్బందికి షోకాజ్ నోటీసులివ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. కానూరు అగ్రహారం, నల్లజర్ల, చాగల్లు,సీతానగరం మండలం మిర్తి పాడు తదితర ప్రాంతాల్లో కోళ్లు చనిపోతున్నట్టు సమాచారం.దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.జిల్లాలో అన్ని మాంసం దుకాణాలు తనిఖీలు చేస్తున్నారు. జాగ్రత్తలు చెబుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఇది మనుషులకు సోకవచ్చు..

బర్డ్‌ఫ్లూ మనిషికి సోకే ప్రమాదం ఉంది. విపరీతంగా జలుబు, ఊపిరాడకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.ఇది ఒక విధమైన కరోనా లక్షణం. కానూరు అగ్రహారం పరిసర ప్రాంతాలైన 34 గ్రామాలకు 34 టీమ్‌లను పంపిస్తున్నాం. అక్కడ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వైద్యశాఖకు కూడా తెలిపి, అక్కడి పనివారికి కూడా పరీక్షలు నిర్వహించాం. కోళ్లఫారంలో పనిచేస్తున్నవారికి ఎటువంటి రోగ నిర్ధారణ జరగలేదు.
- టి.శ్రీనివాస్, పశుసంవర్ధక జిల్లా అధికారి

చికెన్, గుడ్లు తినవద్దు..

కలెక్టర్ ప్రశాంతి

కొద్ది రోజుల పాటు చికెన్, గుడ్లు తినవద్దు. తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారం గ్రామానికి 10 కి.మీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గ్రామంలో ఒక కిలోమీటరు మేర రెడ్ జోన్‌గా.. 10 కిలోమీటర్ల పరిధిలో సర్వే లెన్స్ జోన్‌గా ప్రకటించాం. ఇక్కడ పోలీసులు 144, 133 సెక్షన్లు అమల్లోకి తెచ్చారు. ఎక్కడ బర్డ్ చనిపోతున్నా అధికారులకు సమాచారం ఇవ్వండి. గత వారంలో ఇక్కడి పౌల్ట్రీల నుంచి కోళ్ల రవాణా ఎక్కడికి జరిగిందో సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించాం. 10 కి.మీ పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజల్లో ఏమైనా బర్డ్‌ఫ్లూ లక్షణాలుంటే ఆరా తీసి వైద్య సహాయం అందిస్తాం. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామని..95429 08025 నెంబర్‌లో డాక్టర్ భరత్ అందుబాటులో ఉంటారు.

కరోనా.. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఒకటే

బర్డ్‌ఫ్లూ, కరోనాకు కూడా ఒకే లక్షణాలు ఉంటాయి. ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లు మెడలు వాలేసి ఆకస్మికంగా ప్రాణాలు వదిలేస్తాయి. ఇది ఒక వైరస్. అంటువ్యాధి. రకరకాల కారణాలతో ఈ వైరస్ దాపురిస్తుంది.

అంగన్‌వాడీలకు గుడ్లు నిలిపివేత

తూర్పుగోదావరి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్లు పంపిణీ నిలిపివేసినట్టు జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి కె.విజయకుమారి తెలిపారు. వారం రోజుల పాటు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

కానూరులో పక్షుల వేట

తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో కిలో మీటరు మేర ఏ రకమైన పక్షులు ఉన్నా వెం టనే చంపేసి పాతిపెట్టాలని ఆదేశాలిచ్చారు. ఈ వ్యాధికి వ్యాక్సిన్ లేదు. వ్యాధి వ్యాప్తి చెం దకుండా అరికట్టాలంటే కోళ్లు, బాతులు,ఇతర పక్షులేమైనా సరే చంపేయడమే మార్గమని అధికారులు చెబుతున్నారు.చంపేసిన వాటిని ఒక్కో గోతిలో 1800 కోళ్ల వంతున పాతిపెట్టేయాలని ఆదేశించారు. కోళ్లతో పాటు ఇతర పక్షి జాతి కూడా ఉండకూదన్నారు.

మార్కెట్ ఢమాల్..

జిల్లాలో సుమారు 250 కోళ్ల ఫారంలలో 2 కోట్ల 60 లక్షల కోళ్లు ఉన్నాయి.బర్డ్ ఫ్లూ ప్రబలడంతో జిల్లాలో కోడిమాంసం, గుడ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది. చికెన్, గుడ్లు తినడానికి ప్రజలు భయపడు తున్నారు.చాలా చోట్ల దుకాణాలు వెలవెల బోతున్నాయి. వాస్తవానికి ఉడకబెట్టిన తర్వాత ఏ ప్రభావం ఉండదని చెబుతున్నప్పటికీ ప్రజలు మాత్రం తినడం మానేశారు.

కానూరు అగ్రహారంలో అధికారుల పరిశీలన



కానూరు అగ్రహారం పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ శాంపిల్స్ పాజిటివ్‌గా వచ్చాయని పశుసంవర్థక శాఖ డీడీ ఎస్.సత్యనారాయణ తెలిపారు. పశు సంవర్ధక, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులు సోమవారం గ్రామానికి విచ్చేసి కోళ్లఫారాలను పరిశీలించి మాట్లాడారు. కిలోమీటరు పరిధిలో ఉన్న ఫౌల్ట్రీ కోళ్లతో పాటు నాటు కోళ్లకు వ్యాధి సోకుతుందన్నారు. ప్రస్తుతం రెండు ఫారాల్లో మిగిలిన కోళ్లు చనిపోతాయన్నారు. మండలంలో మిగిలిన ఫారాలకు వైరస్ సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ డి.అచ్యుతకుమారి మాట్లాడుతూ కానూరు అగ్రహారంలోని 10 కిలోమీటర్ల పరిధిలో కోళ్లఫారాల నుంచి ఎటువంటి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



ఘనంగా సదస్యం

ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సదస్యం, పండిత సత్కారం నిర్వహించారు.

పూర్తి వివరాలు..7లో





కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా.. అట్టహాసంగా

రాజశేఖరం నామినేషన్

6

ఏలూరులో టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ

ఏలూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వస్తున్న ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు.. (పక్కన ఇన్‌సెట్)లో కేంద్రమంత్రి వర్మ, రాష్ట్ర మంత్రులు దుర్గేష్, సుభాష్, రామానాయుడు తదితరులు

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి

చివరిరోజు భారీగా నామినేషన్ల దాఖలు

6

- మొత్తం 59 మంది అభ్యర్థులు.. 72 సెట్ల నామినేషన్లు
- పూర్తయిన నామినేషన్ల స్వీకరణ.. నేడు పరిశీలన
- 13 వరకు ఉపసంహరణకు గడువు

శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా

క్రాస్ బండ్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు

నివేదిక సిద్ధం చేసి సమర్పించాలి: కలెక్టర్ మహేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా కాల్వలు, డ్రైన్లపై అవసరమైన చోట్ల క్రాస్‌బండ్లు ఏర్పాటుచేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధంచేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం జిల్లాస్థాయి అధికారులతో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో జిల్లాలోని శివారు భూములకు సైతం సాగునీరు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రాస్‌బండ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనల నివేదికలను ఈ నెల 14లోపు అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నందున ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరించే అంశంపై నాలుగు పారామీటర్ల ఆధారంగా జిల్లాలకు ప్రతీనెల ర్యాంకులు ఇస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, వీఐపీల నుంచి వచ్చే ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. రెండు వారాలలోపు ప్రతీ ఒక్కశాఖ పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న 17 గ్రామాల్లో రీసర్వేను ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. గతంలో సరిహద్దు రాళ్లపై ముద్రించిన చిత్రాలను చెరిపివేసే ప్రక్రియకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఆక్వా, ఆక్వాయేతర జోన్లలో ఉన్న చెరువులను రెవెన్యూ, మత్స్యశాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఈ నెల 20లోపు ఆక్వాజోన్ మ్యాప్‌లను తయారు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఐదుగురు సచివాలయ సిబ్బంది, ఒక ప్రత్యేక నిపుణుడితో కలిసి ప్రజా ప్రతినిధుల సలహాలు తీసుకుని విజన్-2047 ప్లాన్‌లోని పది సూత్రాలు ప్రతిబింబించే ప్రతీ నియోజకవర్గానికి రూపొందించాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా జిల్లాలో ఎవరైనా మనుషులతో ఇసుకను తవ్వి తీసుకుపోవచ్చని, ఇసుకను తరలించేటప్పుడు సంబంధిత సచివాలయంలో కూపన్లు రైజ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయినవిల్లిలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ ఉప కేంద్రానికి సంబంధించి రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో ఏర్పాటు చేయాల్సిన 64 విద్యుత్ టవర్లను నిర్మించడానికి రైతులను ఒప్పించే దిశగా సంబంధిత తహశీల్దార్లు కృషి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ మౌలిక సదుపాయాల మెరుగుకు

అమలాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నాబార్డు ప్రతినిధులు, బ్యాంకర్లు, అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్‌లు, రైతు ఉత్పత్తి సంస్థలు, రాష్ట్ర ప్రాయోజిత ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాలు తదితరాలకు వ్యవసాయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద బ్యాంకులు ఫైనాన్స్ సదుపాయం కల్పిస్తాయన్నారు. ఈ పథకం కింద గ్రామీణ స్థాయిలో వ్యవసాయ పరికరాల కొనుగోలు, గిడ్డంగులు, ప్యాక్ హౌస్‌లు, గ్రేడింగ్ యూనిట్లు, లాజిస్టిక్ సౌకర్యాలు, ప్రాథమిక ప్రోసెసింగ్ కేంద్రాలు, కమ్యూనిటీ వ్యవసాయ ఆస్తులను నిర్మించడానికి బ్యాంకులు ఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తాయన్నారు. రూ.2కోట్ల వరకు అన్ని రుణాలకు సంవత్సరానికి 3 శాతం వడ్డీ రాయితీ చొప్పున ఏడేళ్ల వరకు వడ్డీ రాయితీ వర్తింప చేస్తారని, మొత్తం ప్రాజెక్టు ఖర్చులో పది శాతం వాటాను రుణ గ్రహీతలు అందించాలన్నారు. సమావేశంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ వైఎస్ నాయుడు, లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ, వ్యవసాయ శాఖ జేడీ వి.బోసుబాబు, మార్కెటింగ్ శాఖ ఏడీ విశాలాక్షి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగులు నివారిస్తేనే ఆరోగ్యం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నులిపురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కలెక్టర్ ఆల్బెండజోల్ మాత్రలను అందించి మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3,04,318 మంది 19 ఏళ్లలోపు చిన్నారులు ఉండగా వీరి కోసం 3.40 లక్షల మాత్రలు సిద్ధం చేశామన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులచే జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏకకాలంలో మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టామన్నారు. నులిపురుగులతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు బాధపడుతున్నారని, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారన్నారు. చేతులను శుభ్రం చేసుకోకపోతే ఈ క్రిములు పొట్టలోకి చేరి అభివృద్ధి చెందుతాయని, తద్వారా చిన్నారులు బలహీనంగా కనపడతారన్నారు. పరిశుభ్రతను పాటించే విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి, ఫ్యామిలీ డాక్టర్ ఎం.సుమలత, వైద్యురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాన్‌లెవీ, సీడీపీవో విజయశ్రీ, హెచ్ఎం నాగసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక పరిశోధనలు ఎంతో అవసరం..

సృజనాత్మక పరిశోధనలు భవిష్యత్తు తరాలకు ఎంతో అవసరమని కలెక్టర్ ఆ.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. సృజనాత్మకతతో పాఠశాల విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతూ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.రోహిణి, ఎస్.శశివదన రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలుగా నిలిచి జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటడం అభినందనీయమన్నారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన మల్టీపర్పస్ సైక్లింగ్ ప్రాజెక్టు ద్వారా ధాన్యం మిల్లింగ్, విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశంతో పాటు ఆరోగ్య ప్రదాయకంగా తీర్చిదిద్దిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గైడ్ టీచర్లుగా వ్యవహరించిన పి.శ్రీప్రకాష్, జి.నాగసత్యనారాయణలను ప్రశంసించారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

ఏపీలో నైపుణ్యాభివృద్ధి విద్యా కేంద్రాల ఏర్పాటుకు

కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలి

కేంద్ర మంత్రి జయంతిచౌదరిని కలిసిన ఎంపీ హరీష్

అమలాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీలో నైపుణ్యాభివృద్ధి విద్యా కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌బాలయోగి విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ కీలక ప్రాంతాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు కోరుతూ కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంతిచౌదరిని ఎంపీ హరీష్‌బాలయోగి కలిసి ఈ మేరకు సోమవారం ఒక వినతి పత్రం అందజేశారు. కోనసీమ జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. జవహర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయాలన్నారు. ఐటీఐ కళాశాలల ఆధునికీకరణ పూర్తిచేసి విద్యార్థుల పారిశ్రామిక అవగాహన, నైపుణ్యాలను పెంచుకునేలా ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు. నైపుణ్యాభివృద్ధి విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని వీటి ఏర్పాటుకు కృషి చేయాల్సిందిగా హరీష్ కేంద్ర మంత్రి జయంతిచౌదరిని కోరారు.

ఆయిల్ కంపెనీలు పరిహారం పెంచాలి

7లో



స్వామివారి ఆలయంలో పండిత సదస్యం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

వైభవంగా పండిత సదస్యం

అంతర్వేది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పండిత సదస్యం వైభవంగా జరిగింది. ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై అలంకరించి సదస్యం నిర్వహించారు. ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకస్వాముల సారథ్యంలో ప్రత్యేక మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్లకు వేదాశీర్వచనం ఇచ్చారు. కల్యాణం, రథోత్సవం ముగిసిన తర్వాత స్వామి, అమ్మవార్లు ఆశీర్వచనం పొందే ఈ ఘట్టం భక్తులను పులకింపజేసింది. సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి ధూప సేవ జరి పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, దాసరి వాసు, అయినపర్తి ఏసు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఉండపల్లి అంజి, వలవల రాంబాబు, దత్తుడు, పేరూరు వేద పండితులు పాల్గొన్నారు.



హనుమత్, సింహ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం



హనుమత్, సింహ వాహనాలపై అంతర్వేది నరసన్న

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి వెంకటసత్యనారాయణరాజు వారిచే నిర్మితమైన హనుమద్వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో ఊరేగారు. తొలుత వాహనశాల వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను వాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహన నిర్మాతలు, అధికారులు, అర్చకులు, భక్తులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి లక్ష్మణరావుచే నిర్మితమైన సింహ వాహనంపై పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి హారతులు ఇచ్చారు. ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఎంపీటీసీ బైరా నాగరాజు, అయినపర్తి ఏసు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, వలవల రాంబాబు, ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

నేడు రాజాధిరాజ, అశ్వవాహనాలపై గ్రామోత్సవం

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు రాజాధిరాజ వాహనంపై ఊరేగుతారు. సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ జరుగుతుంది. రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు.

చక్రస్నానానికి ఏర్పాట్లు

బుధవారం ఉదయం 8 గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం చక్రస్నానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలకు వస్తారని అంచనా వేస్తున్నారు. దీంతో బారికేడ్లు నిర్మించి భక్తులంతా కార్యక్రమాన్ని తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



సైకిల్ యాత్ర చేస్తున్న ముత్తు సెల్వన్

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ యాత్ర

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేస్తున్నట్టు తమిళనాడు కోయంబత్తూర్‌కు చెందిన ముత్తు సెల్వన్ తెలిపారు. యాత్రలో భాగంగా సోమవారం ఆయన కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1,111 రోజుల పాటు ఐదు దేశాల్లో 34,300 కిలో మీటర్ల మేరకు సైకిల్ యాత్ర చేస్తున్నానన్నారు. 2021 డిసెంబరు 21న ప్రారంభించిన యాత్ర నేపాల్, బంగ్లాదేశ్, వియత్నాం, థాయ్‌లాండ్, బ్యాంకాక్, మయన్మార్‌ల్లో సాగిందన్నారు. ఇప్పటిదాకా 29వేల కిలోమీటర్లు పూర్తి చేశానని, ఢిల్లీలో ఇండియా గేటు వద్ద ముగిస్తానన్నారు.

కర్ర పెండలం క్రషింగ్

కాకినాడ జిల్లాలో పది మిల్లుల్లో ప్రారంభం... పుట్టికి రూ.1,200 గిట్టుబాటు కాదంటున్న రైతులు



క్రషింగ్‌కు సిద్ధంగా ఉన్న కర్ర పెండలం దుంపలు

సామర్లకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పది సగ్గుబియ్యం మిల్లుల్లో క్రషింగ్ సీజన్ ప్రారంభమైంది. ఆంధ్రా శాగో మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నిర్దేశించిన ప్రకారం జనవరి నెలాఖరు నుంచే దుంప క్రషింగ్ సీజన్ ప్రారంభించాలని అనుకున్నప్పటికీ మిల్లుల్లో కొన్ని సాంకేతిక అవరోధాలను సరిదిద్దడంలో కొంతమేర జాప్యం జరిగినట్టు సమాచారం. ఈ కారణంగానే ఫిబ్రవరి మొదటి వారంలో మూడవ తేదీన మిల్లుల్లో క్రషింగ్ ప్రారంభించినట్టు మిల్లర్లు చెప్పారు. కర్రపెండలం దుంప ఆధారంగా సగ్గుబియ్యం తయారుచేసే మిల్లులు రాష్ట్రంలో కేవలం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే అందునా సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతాలు, ఏజెన్సీ మండలాల్లో సాగవుతున్న కర్ర పెండలం దుంప మొత్తం సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోని సగ్గుబియ్యం మిల్లులకే సరఫరా అవుతుంటాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 28 సగ్గుబియ్యం మిల్లులు ఉన్నప్పటికీ ఈ ఏడాది సుమారు 10 మిల్లులలోనే దుంప క్రషింగ్ జరిపేందుకు సన్నాహాలు చేశామని ఆంధ్రా శాగో మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. రైతుల నుంచి గత ఏడాది కర్ర పెండలం దుంప పుట్టికి (225 కిలోలు) రూ. 1,600 చెల్లించగా ప్రస్తుత ఏడాది పుట్టికి రూ.1,200 మాత్రమే చెల్లించేందుకు నిర్ణయించడంతో ధర గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. అయినా గత్యంతరం లేని పరిస్థితిల్లో పక్వ దశకు చేరిన కర్ర పెండలం దుంపను సగ్గుబియ్యం మిల్లర్లు చెప్పిన ధరకే రైతులు సరఫరా చేస్తున్నారు. గత ఏడాది కొనుగోలు చేసిన ధరకన్నా పుట్టికి రూ.400 చొప్పున నష్టపోవాల్సి వస్తున్నట్టు రైతుల వాదనగా వినిపిస్తోంది. సగ్గుబియ్యం తయారీకి ఉత్పాదక వ్యయం పెరుగుతుండడం, సేలం మార్కెట్‌లో సగ్గుబియ్యం బస్తాకు (60కిలోలు) రూ.3,600కు మించకపోవడంతో దుంపకు అంతకుమించి ధర చెల్లించలేపోతున్నట్టు మిల్లర్లు చెప్తున్నారు. ఈ ఏడాది కర్ర పెండలం దుంప సాగుకు సకాలంలో వర్షాలు కురవకపోవడం వలన భూమిలో దుంప ఎదుగుదల లోపించడం ఒక కారణం. అధిక శాతం మెట్ట రైతులు పామాయిల్ పంట సాగుకు మొగ్గుచూపుతుండడం మరో కారణంగా. దీంతో కర్ర పెండలం దుంప సాగు విస్తీర్ణం రానానూ తగ్గుతోందని పలువురు దుంప రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కేవలం 10వేల ఎకరాలలోపు మాత్రమే దుంప సాగు జరిగినట్టు మిల్లర్ల సమాచారం. రైతులకు ప్రైవేట్ అప్పులుగా పంట పెట్టుబడులు మిల్లర్లు మాత్రమే ఇస్తున్నందున వ్యవసాయ, ఉద్యానవన శాఖల సర్వే కన్నా మిన్నగా దుంప సాగు విస్తీర్ణం సర్వే సమాచారం మిల్లర్లకే ఎక్కువగా తెలుస్తుంది. కాగా దిగుబడి ఎకరాకు 25 పుట్లు అందే అవకాశాలు ఉన్నాయని దుంప రైతు బండే కొండలరావు ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో మార్కెట్లో గిట్టుబాటు ధర లభించనందున దుంప రైతులు నష్టపోయే ప్రమాదమే గాక భవిష్యత్తులో దుంప సాగు ఉనికి కనుమరుగయ్యే అవకాశాలున్నాయని కొండలరావు వాపోయాడు. రాష్ట్రంలోనే ఏకైక దుంప పరిశోధనా కేంద్రం పెద్దాపురంలో ఉన్నప్పటికీ పండించిన దుంపకు గిట్టుబాటు ధర కల్పించడంలోను, సగ్గుబియ్యం మిల్లర్లు ఉత్పత్తి చేసిన సగ్గుబియ్యానికి సేలం మార్కెట్లో గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

తాటిపర్తిలో ముగిసిన

ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

● ఉత్తమ నాటికగా మూల్యం



తాటిపర్తిలో చివరిరోజు ప్రదర్శించిన గురితప్పిన వేట నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సమాజానికి సందేశాన్ని ఇస్తూ, ప్రజలను ఆలోచింపజేసే విధంగా నాటికల పోటీల ప్రదర్శనలు సాగాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 5రోజులు పాటు జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు సోమవారం తెల్లవారు జామున ముగిశాయి. చివరిరోజున గుంటూరు జిల్లా పొన్నూరు రసఝురి కళాకారులు ప్రదర్శించిన గురి తప్పిన వేట అందరిని ఆకట్టుకుంది. మూలకథను మోదుగ సుధ అందించగా, వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు.

విజేతలు వీరే...

ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన మూల్యం నాటిక ఎంపిక కాగా ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా జనరల్ భోగీలు(కొలకలూరి సాయి ఆర్ట్స్)నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత(విశాఖపట్టణం తెలుగు కళాసమితి) ఎంపిక కాగా, ఉత్తమ రచనగా సింహప్రసాద్(మూల్యం), ఉత్తమ నటుడిగా పీపీ వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ నటిగా జ్యోతి రాజ్(మూల్యం), ఉత్తమ ప్రతినాయకుడిగా ఎన్.వెంకటేశ్వరరావు (విముక్తి), ఉత్తమ హాస్య నటుడిగా కన్నబాబు(నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ సహాయ నటుడిగా కావూరి సత్యనారాయణ(చిగురు మేఘం), ఉత్తమ ద్వితీయ నటిగా సురభి ప్రభావతి(జనరల్ బోగీలు), ఉత్తమ రంగాలంకరణ దివాకర్ ప్రభాకర్(మూల్యం), ఉత్తమ ఆహార్యంగా నాగు(చిగురుమేఘం), జ్యూరీ బహుమతుల్లో కె.నాగేశ్వరరావు(జనరల్ బోగీలు), బి.శివశంకరశాస్త్రి(మూల్యం), సమాజానికి సందేశం ఇచ్చే నాటక రచయితగా పీటీ మార్గవ్(జనరల్ బోగీలు) ఎంపికయ్యారు. విజేతలకు మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి, ఇతర ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అపర్ణాదేవి ఆలయ ప్రధాన అర్చకుడు ఆకొండి ప్రభాకర శాస్త్రి, న్యాయనిర్ణేత రాజాతాతయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి దివ్య అధ్యయన మహోత్సవాలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

కోరుకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య అధ్యయన మహోత్సవాలు(తిరునాళ్ళ)వైభవంగా సాగుతున్నాయి. ఏటా స్వామి వారి కల్యాణ మహోత్సవాలకు నెల రోజులు ముందు ఈ దివ్య తిరునాళ్ల జరుగుతాయి. దీనిలో భాగంగా లక్ష్మీనరసింహస్వామి వారు రోజుకొక్క వాహనంపైన గ్రామోత్సవం చేస్తారు. మంగళవారం రాత్రి అశ్వ వాహనంపై గ్రామోత్సవం, బుధవారం రాత్రి శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల్లో లక్ష్మీనరసింహస్వామి వారు 5రోజులు పాటు 5వాహనాల్లో గ్రామోత్సవం చేస్తుండగా అధ్యయనోత్సవాల్లో మాత్రం 5రోజులుపాటు అనంత పద్మనాభ స్వామి వివిధ వాహనాల్లో గ్రామోత్సవం చేస్తారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న కొండపై బేడా ఉత్సవం, శ్రీ నమ్మాళ్వార్ల పరమ పద ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం భీష్మ ఏకాదశి నాటి రాత్రి కొండపైకి తీసుకువెళ్లిన స్వామి వారి ఉత్సవ మూర్తులను గురువారం ఉదయం కిందికి తీసుకువస్తారు.

13 నుంచి రంగనాథ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు

లక్ష్మీనరసింహస్వామి అధ్యయనోత్సవాలు ముగిసిన తరువాత ఈనెల 13, 14 తేదీల్లో శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సమయంలో ఉదయం, సాయంత్రం సేవా కాలం, రాత్రికి బేడా ఉత్సవం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు.

15 నుంచి పద్మనాభస్వామి ఆలయంలో..

శ్రీ రంగనాథ స్వామి అధ్యయనోత్సవాలు అనంతరం ఈ నెల 15, 16 తేదీల్లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థాన క్షేత్ర పాలకులైన శ్రీ భూ సమేత అనంత పద్మనాభస్వామి వారికి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం సేవాకాలం, తీర్థప్రసాదగోష్ఠి, రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయని దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పరాసర రంగ రాజ భట్టర్ స్వామి తెలిపారు. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు దేవస్థానం ఈవో పర్యవేక్షణలో అర్చక స్వాములు, వేదాంత పండితులు నిర్వహిస్తున్నారు.

'ఏటీఎమ్ మోడల్ సాగుతో నిరంతర ఆదాయం'

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో 20సెంట్ల పొలంలో పలు రకాల పంటలను ఏటీఎం మోడల్‌లో సాగు చేయడం ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం కాకి నాడ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎలియాజర్ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో రైతు ఆకుల వీరభద్రరావు పొలంలో ఏటీఎం మోడల్ సాగు, ఘనజీవామృతం, బయోచార్ తయారీలను రాష్ట్రంలోని 26 జిల్లాల ఎస్‌పీఎం పాపుల ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం స్టేట్ కన్సల్టెంట్లు జానకి, బుజ్జిబాబు, రిసోర్స్‌పర్సన్లు శివచక్రం, గోపాలకృష్ణ, భీమరాజు పాల్గొన్నారు.

గొర్రిపూడిలో శూలాల సంబరం



నోటికి శూలాలు గుచ్చుకున్న భక్తులు

కరప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడిలో పురాణ ప్రాశస్త్యం కలిగిన బసవేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అలుగుల(శూలాల) సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కరికాల భక్తులు గత 7 దశాబ్దాలుగా ఈ సంబరాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం కరికాల భక్తులు తమ బుగ్గలకు శూలాల ను గుచ్చుకుని ట్రాక్టర్ల మీద గ్రామంలో ఊరేగారు. అంతకుముందు బసవేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని సమీప కాలువలో స్నానం చేయించి పంచామృతాలతో అభిషేకించారు. బంకమట్టితో నంది ప్రతిమను రూపొందించి పూజల నంతరం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు.

ముగిసిన పొన్నాడ బంగారుపాప ఉత్సవాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో ఈనెల 7న ప్రారంభమైన బషీర్‌బీబీ ఔలియా 70(బంగారుపాప)వ ఉరుస్ ఉత్సవాలు ఆది వారం అర్ధరాత్రి ముగిశాయి. ఆదివారం సాయంత్రం మూలపేట నుంచి బంగారు పాప ఆలయానికి ముజావర్లు గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. గంధం బంగారుపాప ఆలయానికి చేరుకున్న అనంతరం అక్కడ ముజావర్లు పాతెహకానీ అనగానే గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. బంగారుపాప దర్శనానికి అనేక ప్రాంతాల నుంచి నుంచి విచ్చేసిన హిందూ, ముస్లిం భక్తులు గంధం కోసం పోటీపడడం విశేషం. బంగారుపాప ఉరుస్ ఉత్సవాల్లో పాల్గొని బంగారుపాప గంధాన్ని పూసుకుంటే తలచిన పనులన్నీ జరుగుతాయని భక్తుల నమ్మకం.



బంగారుపాప దర్గాకు గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న ముజావర్లు

చివరి రోజు పోటెత్తిన

నామినేషన్లు

- 29 మంది 48 సెట్ల నామినేషన్ల దాఖలు
- మొత్తం 59 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్లు
- పూర్తయిన నామినేషన్ల స్వీకరణ.. నేడు పరిశీలన
- ఉపసంహరణకు 13 వరకు గడువు

ఏలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు చివరి రోజు సోమవారం దరఖాస్తులు పోటెత్తాయి. చివర రోజు ఒక్కరోజే పెద్ద ఎత్తున అభ్యర్థులు ముహూర్తాలు చూసుకుని రావడంతో ఏలూరు జిల్లా కలెక్టరేట్ కిటకిటలాడింది. సోమవారం 29 మంది 48 సెట్ల నామినేషన్ల వేశారు. దీంతో మొత్తం మీద 59 మంది 72 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నెల 11న నామినేషన్ పరిశీలన చేస్తారు. 13న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఇదేరోజు సాయంత్రం బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. తర్వాత గుర్తుల కేటాయింపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయి. 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరగనుంది.

చివరి రోజు నామినేషన్లు ఇలా..

పేరాబత్తుల రాజశేఖరం (కోనసీమ, కూటమి అభ్యర్థి), ఎం.శాస్త్రులు(రావులపాలెం), ఎం.శ్రావణి (రావులపాలెం), ఎస్.రామకృష్ణ (అత్తిలి) ఈయన తరఫున బెంజిమెన్‌రాజు నామినేషన్ వేశారు. కె.జీవ దేవాదయాకర్ (చింతలపూడి), ఏళ్ల దొర బాబు (అమలాపురం), భావన ధాన్యలక్ష్మి (తాడేపల్లిగూడెం), ములకల శ్రీనివాస్ (ఏలూరు, నాలో సెట్), దిడ్ల రాఘవరావు (కోనసీమ), బి.శ్రీనివాస్ (చింతలపూడి), బి.శ్రీరామమూర్తి(రాజమండ్రి), షేక్ హుస్సేన్(ఏలూరు), షేక్ అస్లాం(కాకినాడ), ఆర్.ముఖేష్‌బాబు (దెందులూరు), జేటీ రామారావు (రాజమండ్రి), పి.లీలా గణేష్(ఏలూరు), ఎం.అంబేడ్కర్(రామచంద్రపురం), కె.లావణ్య (నరసాపురం), కె.నాగేశ్వరరావు (రాజమండ్రి), కృష్ణమోహన్ (కాకినాడ), పి.సుప్రజా (నర్సాపురం), కె.గౌతమ్‌బాబు (అమలాపురం), వీవీ సత్యనారాయణ (జగ్గన్నపేట), పేరాబత్తుల సత్యవాణి (కాకినాడ), వి.శ్రీనివాసరావు (పిఠాపురం), నాగభూషణ పద్మ, దాఖలు చేశారు.

అట్టహాసంగా రాజశేఖరం నామినేషన్

- కాకినాడ నుంచి అధిక సంఖ్యలో బయలుదేరిన కార్లు
- ఏలూరులో టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ



పేరాబత్తుల నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఏలూరు,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఏలూరు కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వికి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం కాకినాడ టీడీపీ కార్యాలయం నుంచి కూటమి శ్రేణులు భారీ ర్యాలీగా బయ లుదేరారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అశేషంగా తరలివచ్చిన మంత్రులు, కూటమి నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఏలూరు జిల్లా టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పేరాబత్తుల, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక మీరైతే పరిష్కరించే మనిషిగా నేను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కూటమి బలపర్చిన పేరాబత్తులను గెలిపిస్తాయన్నారు. కేంద్ర ఉక్కు కర్మాగారాలశాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రులు కందుల దుర్గేష్, గొట్టి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ రాజమండ్రి పార్లమెంట్ అధ్యక్షులు కేఎస్.జవహర్, ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, దాట్ల బుచ్చిబాబు, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, జ్యోతుల నెహ్రూ, ముప్పిడి వెంకటేశ్వరరావు, బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, వత్సవాయి ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయకర్, పులవర్తి రామాంజనేయులు, మిరియాల శిరీష, సుబ్బరాజు, ఎమ్మెల్సీలు ఎంఏ.షరీఫ్, వేపాడ చిరంజీవి, దువ్వారపు రామారావు, మాజీ మంత్రులు పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఏపీఐడీసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుడి సదస్యం



భీమేశ్వరుడి సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు

● సమస్త వాహనాలపై స్వామి గ్రామోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారంరాత్రి భీమేశ్వరస్వామివారి సదస్యం ఘనంగా జరిగింది. కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామిలను వేదికపై అధిష్టింపచేశారు. ఆలయ అర్చకస్వాములు ముందుగా స్వామి,అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలను పూచారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహం, ముక్కోటి దేవతా ఆవాహం చేశారు. అనంతరం వేదస్వస్తి, స్వస్తి ప్రవచనం జరిపారు. తదనంతరం ఆగమ పండితులు, వేదపండితులు, స్వస్తి వాచకులు, అర్చకస్వాములు, పురోహితులను నూతన వస్త్రాలతో ఈవో, సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవాని సత్కరించారు. నీరాజన మంత్రపుష్ప కార్యక్రమంతో సదస్యం పూర్తయ్యింది. వడపప్పు, పానకం భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం సమస్త వాహనములపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, పురోహితులు ఆలయసిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వేదపండితులను సత్కరిస్తున్న ఈవో

గోడకు కన్నం...బంగారం మాయం

● ఏలేశ్వరంలో రూ.38.25లక్షల బంగారు, వెండి ఆభరణాలు అపహరణ ● ఆధారాల సేకరణలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్

ఏలేశ్వరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం బాలాజీచౌక్ సెంటర్‌లో శ్రీసిద్ధినాధ్ జ్యూయలర్స్ బంగారం దుకాణంలో రూ.38.25లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం దుకాణ యజమాని మహారాష్ట్రానికి చెందిన శివాజీ సుమారు 25 సంవత్సరాల క్రితం ఏలేశ్వరం వచ్చి బంగారం వ్యాపారాన్ని మార్కెట్‌లో కొనసాగించేవారు ఇటీవల నూతనంగా తమ వ్యాపారాన్ని మెయిన్‌రోడ్డుకు మార్చారు. సోమవారం ఉదయం పదిగంటలకు శివాజీ ఇంటి నుంచి వచ్చి దుకాణం తెరచి లోపలకి వెళ్లి చూసేసరికి దుకాణం వెనుక భాగం గోడను డ్రిల్లింగ్ మిషన్ సహాయంతో రంధ్రంగా చేసి లోపలకు దుండగులు ప్రవేశించారని దుకాణ యజమాని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ శ్రీహరిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని సీఐ నుంచి వివరాలు సేకరించి జిల్లా కేంద్రం కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించే పనిలోపడ్డారు. నగల దుకాణం నుంచి బయలుదేరిన జాగిరం దుకాణాలవద్దకు తిరిగి వచ్చింది. దుండగులు గోడ పగులగొట్టి లోపలకు వచ్చి సీసీ కెమెరాల డీవీఆర్‌ను చాకచక్యంగా తొలగించి లోపల రెండు నగదు లాకర్లు ఉండగా వీటిలో ఒక లాకరును పగులగొట్టి వాటిలో ఉన్న 50గ్రాములు బంగారు ఆభరణాలు, 32 కేజీల వెండి వస్తువులను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.38.25లక్షలు ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఈ దొంగతనంపై అన్ని కోణాల్లోను దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి దుండగులు ఎంతమంది అనేది దర్యాప్తులో వెల్లడవుతాయన్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, పోలీసు అధికారులు ఉన్నారు.





దుకాణంలో గోడకు రంధ్రంపెట్టి లోపలకు వచ్చి లాకర్లను పగులగొట్టిన దొంగలు, సంఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న సీఐ సూర్యఅప్పారావు, వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఏపీఈఏపీసెట్ కన్వీనర్‌గా వీవీ సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



ఏపీఈఏపీసెట్ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్సీహెచ్ఈ నేతృత్వంలో జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్-2025కు కన్వీనర్‌గా నియమితులైన మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు, సెట్ ఛైర్మన్ ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ సమక్షంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఈఏపీసెట్)ను ఎటువంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు తగినచర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తామని అదేవిధంగా కోకన్వీనర్లు, కోఆర్డినేటర్లను నియమిస్తామన్నారు. ఈసందర్భంగా తనను కన్వీనర్‌గా నియమించినందుకు సీఎం నారాచంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, ఏపీ ఎస్సీహెచ్ఈ ఛైర్మన్ కె.మధుమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాద్, డైరెక్టర్లు వి.రవీంద్ర, సీహెచ్ సాయిబాబు, బి.బాలకృష్ణ, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, ఎం.రామలింగరాజు, పద్మరాజు, విభాగాధిపతులు వెంకటరెడ్డి, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన కొమ్మిశెట్టి సత్తిబాబు

అనపర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బిల్డింగ్ సెంటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి సెంటరింగ్ మెటీరియల్ తెచ్చి వ్యాన్ నుంచి దింపే క్రమంలో అదే వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన సోమవారం అనపర్తిలో చోటుచేసుకుంది. అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండపేటకు చెందిన కొమ్మిశెట్టి సత్తిబాబు (29) బిల్డింగ్‌లకు సెంటరింగ్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనపర్తిలోని రిజిష్టార్ ఆఫీసు సమీపంలో సెంటరింగ్ పనులు ఒప్పుకున్న సత్తిబాబు సోమవారం సెంటరింగ్‌కు సంబంధించిన సామగ్రిని టాటా ఇంట్రా వ్యాన్‌లో తీసుకుని వచ్చాడు. సామాన్లను దింపే క్రమంలో వ్యాన్ వెనుక భాగంలో నిలుచున్న సత్తిబాబు అనుకోకుండా వ్యాన్‌ను డ్రైవర్ వెనుకకు నడపడంతో సత్తిబాబును ఢీకొంది. దీంతో అక్కడే ఉన్న కర్రలపై పడటంతో సత్తిబాబు చెంపకు కర్ర బలంగా తగలడంతో అక్కడికక్కడే కూలబడ్డాడు. స్థానికులు సత్తిబాబును అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య నాగదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి



మృతి చెందిన పండ్ల వ్యాపారి నరెడ్ల సత్తిబాబు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు ప్రత్తిపాడు తోటవీధికి చెందిన నరెడ్ల సత్తిబాబు(62)స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం పొందుతున్నాడు. సోమవారం రాచపల్లి అడ్డురోడ్డులోని హోటల్ నుంచి భోజనం పొట్లాలను మోటార్ బైక్‌పై తీసుకువస్తుండగా మినర్వా విద్యాసంస్థల ఎదుట తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్లే వాహనం ఢీ కొంది. దీంతో సత్తిబాబు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సత్తిబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అర్థాంతరంగా రోడ్డు ప్రమాదంలో సత్తిబాబు మృతి చెందడంతో స్థానిక తోటవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వానికి తరలించి ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడ్స్ రైలు ఢీ కొని వృద్ధుడి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. తునినుంచి అన్నవరం వైపు వెళ్తున్న గూడ్స్ రైలుని గమనించకుండా పట్టాలు దాటుతుండడంతో రైలు ఢీకొని వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతని వయస్సు 55, అతనివద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

హాకీ టోర్నమెంట్ నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు

● కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



హాకీ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆల్ ఇండి యా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల టోర్నమెంట్‌ను కాకి నాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్ వేదికగా నిర్వహించేందుకు సన్నాహక ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నా యని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రీడాపోటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తుండగా, కాకినాడజిల్లా యంత్రాంగం ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, రీజనల్ స్పోర్ట్స్ బోర్డుల నుంచి పురుషుల, మహిళల టీమ్‌లు ఈపోటీలలో పాల్గొంటున్నాయన్నారు. దీనికి సంబంధించి ఈనెల 6వ తేదీ వరకు ఎంట్రీలు స్వీకరించగా, 26 పురుషులజట్లు, 7 మహిళలజట్లు ఎంట్రీలు పంపాయన్నారు. ఒక్కొక్క జట్టులో 18 మంది క్రీడాకారులు, ఒక కోచ్, ఒక మేనేజర్‌లతో మొత్తం 20మంది సభ్యులు ఈపోటీలకు హాజరుకానున్నారు. లాజి స్టిక్స్ ట్రాన్స్‌పోర్ట్, రిసెప్షన్, రిజిస్ట్రేషన్, ఫుడ్, బస, వైద్యం, పారిశుద్యం తదితర అంశాల పర్యవేక్షణకు జిల్లా అధికారుల కూర్పుతో 14 ఉపకమిటీలను ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీ చేశారు. టోర్నమెంట్‌లో జరిగే రోజువారీ పోటీలు, టీమ్‌ల వివరాలు, విజేతల సమాచారాన్ని టెక్నికల్ కమిటీ, ప్రెస్‌అండ్ మీడియా కమిటీలు అందిస్తాయన్నారు. ప్రేక్షకుల గ్యాలరీలు, క్రీడాకారుల చేంజింగ్ రూమ్‌లు, లైటింగ్, సౌండ్, తాగునీరు, మరుగుదొడ్లు, టీమ్‌లకు బస, రవాణా, ఆహారం ఏర్పాట్లతో ఆల్ ఇండియా సివిల్ సర్వీ సెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు రంగం సిద్ధం అవుతోందన్నారు.

తునిలో బాలుడి కిడ్నాప్ కలకలం

● పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు బాలుడు



తల్లి వద్దకు చేరిన బాలుడు

తుని రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో బాలుడు కిడ్నాప్ కలకలం రేగింది. తుని పట్నంలో భాష్యం విద్యా సంస్థల్లో ఒకటో తరగతి చదువుతున్న పరమేష్ అదృశ్యం అవడం సర్వత్రాచర్చనీయాంశమైంది. ఉదయాన్నే స్కూల్‌కి వెళ్ళిన బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు బాబుకి ఐ డ్రాప్స్ వేయాలని ఒకసారి పంపించాలంటూ స్కూల్ సిబ్బందిని కోరగా అదృశ్యమైన బాలుడు తాలూకా అని భావించిన స్కూల్ సిబ్బంది బాలుడిని బయటకు పంపించినట్లు స్కూల్ సిబ్బంది చెబుతున్నారు. బాలుడు వెళ్ళిన కొద్ది సమయానికే లంచ్ బాక్స్‌తో కుటుంబ సభ్యులు స్కూల్‌కు వెళ్ళి బాలుడి కోసం ఆరా తీయగా అదృశ్యమైన విషయం గమనించిన తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడంతో రంగంలోకి దిగిన పోలీసులు బాలుడు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భాష్యం పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో అవాక్కైన పోలీసులు బాలుడిని తీసుకెళ్ళిన మార్గంలో సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలిస్తూ దర్యాప్తు ముమ్మరం చేశారు. కొద్ది సమయానికి బాలుడిని దుండగులు డి.పోలవరంలో ఆటో ఎక్కించి తుని పట్టణానికి పంపిస్తున్నామని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో సీఎంఆర్ సెంటర్లో బాబు రాకకోసం ఎదురు చూశారు. దుండగులు చెప్పిన విధంగానే కొద్ది సమయానికి బాబు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పచెప్పిన తుని పట్టణ పోలీసులు కిడ్నాప్ వెనుక ఎవరు ఉన్నారు, ఎందుకు చేశారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు, రేపు మన్యం బంద్

రంపచోడవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాలలో అమలులో ఉన్న ఆదివాసీ అనుకూల చట్టాల సవరణ యోచనకు వ్యతిరేకంగా మంగళ, బుధవారాల్లో ఆదివాసీ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బంద్‌పై పోలీసులు ఆంక్షలు విధించారు. ఆదివాసీ చట్టాల సవరణ అంశంలో ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు దుమారంగా మారడంతో ఆదివాసీ సంఘాలన్నీ ఆందోళనలు సాగిస్తూ చివరకు రెండు రోజుల రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. వీరి ఆందోళనలు, బంద్‌లపై పోలీసు అధికారులు పలు ఆంక్షలు విధించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి అనుమతులూ లేని ఆందోళనలపై చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఆయా సంఘాల నాయకులకు ఎక్కడికక్కడా ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో నోటీసులను జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను ఆపడం, రవాణాలను స్తంభింపచేయడం, కార్యాలయాలను, వ్యాపార సంస్థలను మూసి వేయించడం వంటివి నేరాల కిందకు వస్తాయని పోలీసులు హెచ్చరించారు.

ఎస్ఐ మూర్తి కుటుంబానికి పోలీసుల అండ

● భారీ ఆర్థిక సాయం ● రూ.46.78లక్షలు అందజేత



మరణించిన ఎస్ఐ మూర్తి కుటుంబానికి ఆర్థికసాయం, చెక్కును అందజేస్తున్న పోలీసు మిత్రులు

కె.గంగవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం గ్రామానికి చెందిన ఆదుర్తి గంగ సత్యనారా యణమూర్తి (ఏఎస్ఎన్ మూర్తి) ఇటీవల తణుకు పోలీస్టేషన్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వారి కుటుంబానికి తాము అండగా ఉంటామని పోలీసు మిత్రులు ముందుకువచ్చారు. సోమవారం కె.గంగవరంలో మూర్తికి నివాళి అర్పించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మూర్తి మిత్రులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకుని ఎస్.ఐ. పోస్టుకు ఎంపికయ్యాడు. 2012 పోలీసు శిక్షణలో చాలా చురుకుగా ఉండేవాడు. ఎవరికైనా చిన్ని కష్టం వచ్చిందంటే చలించిపోయి ఆదుకునేందుకు ముందుండేవాడు. విధి వక్రీకరించింది. అకస్మాత్తుగా చనిపోయాడు. భార్య, ఇద్దరుపిల్లలు, తల్లిదండ్రులను ఆదుకోవాలని నిర్ణయించాము. ఇద్దరు పిల్లల చదువులు, వారి భవిష్యత్ కోసం రూ.46.78 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి 2012 బ్యాచ్‌కు చెందిన 1156మంది రూ.30లక్షలు ఇద్దరు పిల్లలకు చెందే విధంగా ఫిక్సిడ్ డిపాజిట్‌గా వేశారు. ఇదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా ఎస్.పి.నయీఆస్మీ రూ.4లక్షలు తల్లిదండ్రుల నిమిత్తం. పోలీసు స్క్వాడ్ వారు 27మంది 1.10లక్షలు, ఏలూరు జోన్ పోలీస్ అసోసియేషన్‌కు చెదిన 126 మంది 10.58లక్షలు భార్యాపిల్లలకు వెరసి రూ.46.78లక్షలు మూర్తి తల్లి దండ్రులు ఆదూర్తి గోపాలరావు, సూర్యావతి, భార్య విజయలక్ష్మి, పిల్లలు చందన, హెమాన్షిలకు అందజేశారు. వీటిలో రూ.20 లక్షలు చొప్పున ఇద్దరు పిల్లలకు ఫిక్సిడ్ డిపాజిట్‌గా వేశారు. రూ.4లక్షలు తల్లిదండ్రులకు, రూ.1.68 లక్షలు భార్యకు విభజించి అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.విశ్వనాద్, ఏలూరు రేంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు మోజేష్, పామర్రు ఎస్.ఐ. ఎస్.కె. జానీబాషా, పోలీసుమిత్రులు శ్రీహరి, రమేష్, దుర్గారావు, శంకరు, విజయ్, వెంకటరమణ, గురవయ్య, వాసు, బుచ్చిబాబు తది తరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్వార్టర్ ఫైనల్స్

● రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు



క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి- విశాఖజిల్లా జట్లు

పిఠాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలోగల బాస్కెట్‌బాల్ క్రీడామైదానంలో జరుగుతున్న మాజీ మంత్రి కొప్పన మోహనరావు, రమాదేవి స్మారక 8వ రాష్ట్రస్థాయి యూత్(అండర్ 17) బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 13 ఉమ్మడి జిల్లాలు నుంచి బాలబాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల మూడో రోజు సోమవారం రాత్రి బాలబాలికల విభాగంలో క్వార్టర్‌ఫైనల్స్ ఉత్కంఠభరితంగా సాగాయి. బాలికల విభాగంలో విశాఖ జిల్లా జట్టుపై తూర్పుగోదావరిజిల్లా జట్టు విజయం సాధించగా, గుంటూరుపై అనంతపురం, చిత్తూరుపై కృష్ణా, కర్నూలుపై పశ్చిమగోదావరిజిల్లా జట్లు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో విశాఖపై తూర్పుగోదావరి, గుంటూరుపై పశ్చిమగోదావరి, కర్నూలుపై చిత్తూరుజిల్లా జట్లు విజయం సాధించి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకున్నాయి. పోటీలను ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ మాజీ సహాయ కార్యదర్శి బొజ్జా రామయ్య, ఇండియన్ ఉమెన్స్ టీమ్ కోచ్ శ్రీనాథ్, జాతీయ క్రీడాకారుడు మల్లీశ్వరరావు తదితరులు తిలకించి సూచనలు ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావులు పోటీల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో, ఆర్ఐకు తీవ్రగాయాలు



వీఆర్వోకు చికిత్స చేస్తున్న వైద్యులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కొత్తపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్వో, ఆర్ఐలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. రోజువారీ విధుల్లో భాగంగా కార్యాయానికి వెళుతున్న కొత్తపల్లి ఆర్ఐ మధుసూధనరావు, వాకతిప్ప వీఆర్వో చంద్రశేఖర్ మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్నారు. కొత్తపల్లి మీసేవ సమీపించే సరికి వెనుక నుంచి వేగంగా బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆర్ఐ, వీఆర్వోను ఢీకొట్టారు. దీంతో వీరిద్దరు రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వీఆర్వోకు తలకు, చెవికి గాయాలవ్వగా స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. ఆర్ఐ తలకు బలమైన గాయం తగలడంతో అత్యవసర చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో ఐదుగురికి అస్వస్థత

కొత్తపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేసుకుంటున్న రైతులపై తేనెటీగలు దాడి చేయడంతో ఐదుగురు రైతులు అస్వస్థతకు గురైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లిలో జరిగింది. సోమవారం కొత్తపల్లిలో ఐదుగురు రైతులు దాళ్వా వరి చేలో కలుపు తీస్తున్నారు. కలుపు తీసేచోట గట్టుకుఉన్న చెట్టుకొమ్మపై తేనెతుట్ట ఉండడాన్ని గమనించకపోవడం, వాళ్ళు కలుపు తీసేందకు తుట్ట పక్క నుంచి చేలో దిగి పనిచేయడంతో తుట్ట కదలి ఈగలు రైతులపై ముప్పేట దాడి చేశాయి. రైతులు వరి చేలల్లో నుంచి పరుగెత్తుకొంటూ గట్టుకు చేరారు. రైతులు వెంటనే చికిత్స కోసం పీహెచ్‌సీకి తరలించారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో సుప్రీం ఆదేశాలు పాటించాలి: పీడీజే



సమావేశం నిర్వహిస్తున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ ప్రమాద కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఛైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కమిటీలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాకు చెందిన రెవెన్యూ, పోలీసు అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. అనంతరం డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల రెవెన్యూ, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నష్టపరిహారం పెంచాలి

● ప్రజాప్రతినిధుల డిమాండ్



ఏలూరులో సమావేశమైన జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):సముద్ర జలాల్లో ఆయిల్ కంపెనీలు కొనసాగిస్తున్న కార్యకలాపాల వల్ల జరుగుతున్న నష్టాలకు అందించే పరిహారం పెంచాలని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు కాకినాడ, కోనసీమ జిల్లాల ఎమ్మెల్యేలు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరులో వీరు సమావేశం నిర్వహించారు. నష్టపరిహారం పెంపుపై ఆయిల్ కంపెనీలకు హెచ్చరిక జారీచేశారు. నరసాపురం నుంచి తుని వరకు వేటకు వెళ్ళే మత్స్యకారులందరికీ నష్టపరిహారం అందించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రస్తుతం కేటాయిస్తున్న మొత్తాన్ని రెండు శాతం పెంచాలని సూచించారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ల ద్వారా ఆయిల్ కంపెనీలకు లేఖలు పంపించేలా చర్యలు తీసుకునేందుకు సమావేశంలో నిర్ణయించినట్లు ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, వేగుళ్ళ జోగేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, వనమాడి కొండబాబు, పంతం నానాజీలు పాల్గొన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

● 119 మంది అరెస్ట్, ● రూ.9,87,000 నగదు , 112 కోళ్లు స్వాధీనం

తాళ్లరేవు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోరింగ పోలీసుస్టేషన్ పరిధి జి.వేమవరంలో కోడిపందాలపై ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో ఎస్‌డీపీవో, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కోరింగి ఎస్ఐ పి.సత్యనారాయణ నేతృత్వంలో కోరింగ పోలీసులు ఆదివారం రాత్రి కోడిపందాలపై దాడిచేశారు. పోలీసుల వివరాల ప్రకారం జి.వేమవరం గ్రామం పెంకే రాంబాబు అలియాస్ చొల్లంగి రాంబాబు మామిడితోటల్లో కోడిపందాలను నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సిబ్బంది, కాకినాడరూరల్ సీఐ, పోలీసులుకోడిపందాలపై దాడిచేశారు. 119మంది జూదగాళ్లను పట్టుకుని వారివద్ద నుంచి రూ.9,87,000 నగదు ను, 112 పందెం కోళ్లను, 5కార్లు, 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదుచేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



జి.వేమవరంలో పందాల రాయుళ్లను అదుపులోకి తీసుకుంటు న్న పోలీసులు

విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు
అంబాజీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మాచవరం పరిధిలోని కోటివారి అగ్రహారంలో వేంచేసియున్న శ్రీభువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

దోమల నివారణ చర్యలు
కాట్రేనికోన, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకటను దాకర్ చర్యలు తీసుకున్నారు. నాలుగు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. సోమవారం పలు ప్రాంతాల్లో ఈమిషన్ల ద్వారా పొగను వెదజల్లారు. సర్పంచ్ చొరవతో ఇక తమకు దోమల బాధ నుంచి విముక్తి కల్గుతుందని ప్రజలు భావిస్తున్నారు.

శరభ.. శరభ.. తన్మయత్వంతో వీరభద్రుని సంబరాలు


బండారులంకలో త్రిశూలాలు ధరించి వీరభద్రునికి ప్రతీకగా విభూదిపండ్లను ఊరేగిస్తున్న వేలాదిమంది భక్తులు


వీరభద్రులను గద్దె నుంచి బయటికి తీసుకువస్తున్న దృశ్యం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శరభ.. శరభ.. అంటూ భక్తుల తన్మయత్వంతో బండారులంక పురవీధులు పులకించిపోయాయి. ఆత్మలకు ప్రతిరూపంగా.. ఈశ్వర తత్వానికి నిదర్శనంగా విభూది పండ్లను.. త్రిశూలాలను ధరించి భక్తులు పుర వీధుల్లో ఊరేగారు. పాత బండారులంక శ్రీవీరన్నబాబు ఆలయం వద్ద సోమవారం జరిగిన వేడుకల్లో వయోభేదం లేకుండా వందలాది మంది సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులకు ప్రతి రూపాలుగా విభూది పండ్లను గద్దెకు సమర్పించిన వారు వీరభద్రుని సంబరం రోజున ఎక్కడ ఉన్నా హాజరవ్వడం ఆనవాయితీ. వీరన్నబాబు ఆలయం వద్ద నుంచి వేలాది మంది భక్తులు అర్లపల్లి అమ్మన్న ఆధ్వర్యంలో చినచంద్రపురంలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. స్నానాదులు ముగించుకుని ఆలయంలో వీరభద్రునికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నుంచి వీరన్నబాబు భక్త బృందం ఆధ్వర్యంలో మహిళలు, భక్తులు విభూదిపండ్లను పళ్లాల్లో ఉంచుకుని చేతుల్లో త్రిశూలాలు ధరించి ఊరేగింపుగా బయలుదేరారు. బాజాభజంత్రీలతో మురుగులమ్మ గుడిసెంటర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకోగా వారికి భక్తులు దారి పొడవునా స్వాగతం పలికారు. అనంతరం ఊరేగింపు అర్లపల్లి నాగేశ్వరరావు స్వగృహానికి చేరుకున్న తర్వాత వీరభద్రులను గద్దెలో ఉంచారు. వేలాది మందికి అన్నసమారాధన జరిపారు. పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అదేవిధంగా అమలాపురం దేవాంగుల వీధిలో అడ్డాల సూర్యకుమారి ఆధ్వర్యంలో వీరన్నబాబు సంబరం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలిరాగా తలపై విభూది పండ్లను ధరించి త్రిశూలాలు చేతబూని గడియార స్తంభం సెంటర్ మీదుగా నల్లవంతెన వద్దనున్న ఆలయం వద్దకు చేరుకున్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా


అమలాపురం ఎమ్మార్సీ కార్యాలయంలో సమీక్షలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పీఎంశ్రీ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పిలుపునిచ్చారు. అమలాపురం ఎమ్మార్సీ భవనంలో సోమవారం పీఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ సిబ్బంది, సమగ్రశిక్ష అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని 26 పీఎంశ్రీ పాఠశాలలకు కాంపోనెంట్ వారీగా మంజూరైన నిధులను వెంటనే ఖర్చు చేయాలన్నారు. ఆయా పాఠశాలలకు మంజూరైన కెమిస్ట్రీ ల్యాబ్‌లు, లైబ్రరీ రూములు, బయాలజీ ల్యాబ్‌లు, ఆటస్థలాల అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను కాంపోనెంట్ వారీగా ఖర్చు చేయాలన్నారు. ఇప్పటి వరకు మంజూరైన నిధులను ఖర్చు చేస్తేనే మిగిలిన నిధులు విడుదలయ్యే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలల పనుల పనితీరు ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందన్నారు. పీఎంశ్రీ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు పదో తరగతి ఫలితాల్లో పీఎంశ్రీ పాఠశాలలు తమదైన మార్కుల ప్రగతిని చూపించాలన్నారు. సమావేశంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, సమగ్రశిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బరాజు, అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు, డీఈ నాగేశ్వరరావు అభివృద్ధి పనుల ప్రగతిని కాంపోనెంట్ల వారీగా వివరించారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి సరెళ్ల దుర్గాదేవి, సమగ్రశిక్ష కార్యాలయ ఏఎస్వో కె.నారాయణరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, సుబ్రహ్మణ్యం, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వలంటీర్ల ధర్నా


కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్ల ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, హామీ మేరకు రూ.10వేలు వేతనం అందించాలని నినాదాలతో హోరెత్తించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తుందని సీఎం చంద్రబాబుతో పాటు కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. కనీస వేతనం రూ.5వేలు నుంచి రూ.10వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పది నెలలు అయినా వలంటీర్లను పట్టించుకోకపోవడం విచారకమన్నారు. తక్షణం వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు, వలంటీర్ల సంఘ నాయకుడు నవీన్, ప్రసాద్, శ్రీలక్ష్మి, ప్రసన్న, భవానీ పాల్గొన్నారు.

పునర్జన్మకు కారణమైన పునర్వసు నక్షత్ర పూజలు
ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పునర్జన్మకు కారణభూతంగా భావించే పునర్వసు నక్షత్రం ఎంతో ప్రత్యేకత సంతరించుకుంది. విలసవిల్లి మహాసౌరయాగంలో సోమవారం పునర్వసు నక్షత్ర జాతకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పునర్వసు నక్షత్ర వృక్షం వెదురు చెట్టుకు విశేష అభిషేక పూజలు జరిగాయి. పునర్వసు నక్షత్ర జాతకుల ప్రత్యేకతలను సౌరయాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ వివరించారు. గోమాత పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

25వేల మందికి లక్ష్మీనరసింహుడి దర్శనం
అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘశుద్ధ త్రయోదశి ఏడో రోజు సోమవారం ఆలయంలో విశిష్ట అభిషేకాలు నిర్వహించినట్టు అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. అమలాపురంలో ఆమె మాట్లాడుతూ ఏడో రోజు స్వామివారిని 25వేల మంది భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారన్నారు. సోమవారం సాయంత్రం హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఫౌండేషన్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజాబహదూర్, ఉత్సవ సేవాకమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. సింహవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించినట్టు తెలిపారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ
రాజోలు,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి):రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, డబ్ల్యుఈసీ వారి సౌజన్యంతో 70మంది విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు వేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, వైస్‌ప్రిన్సిపాల్ పద్మనాభం, ఎన్.రాజు, సరిత, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు పి.శైలజ, డబ్ల్యుసీకోఆర్డినేటర్‌పాల్గొన్నారు.

వృత్తి కళాకారుల సమస్యలు పరిష్కరించాలి


అవార్డులు సాధించిన కళాకారులను సన్మానించిన సంక్షేమ సంఘ సభ్యులు

మామిడికుదురు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వృత్తి కళాకారుల సమస్యలు పరిష్కరించాలంటూ కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షుడు ఈలి శ్రీనివాసరావు కోరారు. సంఘ సమావేశం సోమవారం మామిడికుదురులోని అంబేడ్కర్ సామాజిక భవనం వద్ద మంగం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కళాకారుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని, పెన్షన్ అర్హత వయసు 55ఏళ్లకు తగ్గించాలని, కళాకారులకు ఇళ్ల స్థలాలిచ్చి ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇటీవల పలు పురస్కారాలు అందుకున్న సంఘ అధ్యక్షుడు మంగం సత్యనారాయణను, బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అడబాల సత్యనారాయణను, రాజోలు నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన అడబాల రాంబాబును, ఎంబీబీఎస్ పూర్తిచేసిన మద్దుల సింధును సంఘ సభ్యులు దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఈలి శ్రీనివాసరావు, పితాని నాగరాజు, అధ్యక్షుడిగా మంగం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అడబాల సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా దూనబోయిన వీరరాఘవులు, కోశాధికారి సరిదే లక్ష్మి తదితర సభ్యులను ఎన్నుకున్నారు. ఉండ్రు శ్రీరామారావు, కోటిపల్లి శ్రీదేవి, ఎ.రాంబాబు, చిట్టూరి దాశరథి పాల్గొన్నారు.

మద్యం షాపు పెట్టొద్దు


నిరసన తెలుపుతున్న మహిళలు

అంబాజీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మాచవరం శివారు కుసుమవారిపేట పీచుఫ్యాక్టరీ వద్ద మద్యం షాపు పెట్టవద్దని మహిళలు సోమవారం సాయంత్రం నిరసన చేపట్టారు. అంబాజీపేటకు చెందిన మద్యం షాపును అక్కడకు మార్పు చేసేందుకు నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో మహిళలు అక్కడ షాపు పెట్టవద్దని నిరసన తెలిపారు. వెంకటేశ్వరకాలనీ, కుసుమవారిపేట, చిన్నకుసుమవారిపేటలకు సంబంధించి పీచుఫ్యాక్టరీ సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నాయన్నారు. తమ భర్తలతో పాటు యువకులు మద్యానికి బానిసై ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం షాపు పెట్టేందుకు ప్రయత్నిస్తే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మాయాబజార్ నాటక ప్రదర్శన



అంతర్వేది, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉత్సవ సేవా కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ దిరిశాల బాలాజీ పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక భక్తి గీతాలాపనలు, వినూత్న నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం రాత్రి 8గంటలకు సురభి వారిచే మాయాబజార్ నాటక ప్రదర్శన అద్భుతంగా నిర్వహించారు. కళాకారులు కళాత్మకమైన వేషధారణల్లో వివిధసెట్టింగుల్లో పూర్వకాలపు ఆకృతులను ఆచార సంప్రదాయాలను నేటి సమాజానికి తెలియచేస్తూ నాటిక ప్రదర్శించడం ఆకర్షించింది. కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాయాబజార్ నాటకాన్ని తిలకించారు.ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తినాని, గుబ్బల ఫణికుమార్, బైరా నాగరాజు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు

నామినేషన్‌కు తరలివెళ్లిన టీడీపీ నాయకులు
ముమ్మిడివరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏలూరులో సోమవారం జరిగిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ నామినేషన్ కార్యక్రమానికి ముమ్మిడివరం నుంచి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక కార్లు, బస్సుల్లో ఏలూరు తరలివెళ్లారు. పార్టీ నాయకులు దాట్ల పృథ్విరాజ్, గుత్తుల సాయి, సాగి సూరిబాబురాజు, నాగిడి నాగేశ్వరరావు, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, చవటపల్లి నాగు, కాకర్లపూడి రాజేష్‌యాళ్ల ఉదయ్, రంబాల రమేష్, ముత్యాల జయలక్ష్మి, పాయసం చిన్నీ, గొల్లపల్లి ధర్మారావు, కూటమి నాయకులు తరలివెళ్లారు.

తరలివెళ్లిన కూటమి కార్యకర్తలు
కాట్రేనికోన, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కూటమి పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ కార్యక్రమానికి పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. విత్తనాల వెంకటరమణ, వెంట్రు సుధీర్, ఇసుకపట్ల వెంకటరమణ, కడలి వెంకటసత్యనారాయణ, సాపే రూప, కొంకి శ్రీను, మోర్త శ్రీనివాసవర్మ, కొవ్వూరి శ్రీనివాసరాజు, సంసాని గంగాధర్, ఇసుకపట్ల గోవింద్ వెళ్లినవారిలో ఉన్నారు.

సీతారామాలయంలో ముగిసిన సప్తాహ పూజలు
అల్లవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అల్లవరం సెంటర్‌లోని సీతారామాలయంలో సప్తాహ నిత్య పూజలు సోమవారం ముగిశాయి. బండిగుప్తాపు చిట్టి వెంకన్న దంపతులతో ఏడు రోజులు ఆలయ పురోహితులు పూజలు నిర్వహించారు.చివరిరోజైన సోమవారం సీతారామ ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధనకు, సీతారాములవారి సందర్శనకు భక్తులు పోటెత్తారు. బండిగుప్తాపు రంగ, ఆచంట రవి, బండిగుప్తాపు సత్తిబాబు, కంకిపాటి వీరబాబు, బండిగుప్తాపు వెంకటేశ్వరరావు, సుంకరసాయి, ఆచంట రవి, మొయిల సోమరాజు, కాకిలేటి సాయిబాబు, సుంకర రాము స్వామివారిని దర్శించుకున్నారు.

సహకార రంగం బలోపేతానికి కృషిచేయాలి
అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించారు. కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సహకార రంగ ప్రాముఖ్యతను తెలపడానికి ఐక్యరాజ్యసమితి 2025సంవత్సరాన్ని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోఆపరేటివ్‌గా ప్రకటించిందన్నారు. జిల్లాలో అంతర్జాతీయ సహకార సంవత్సర వేడుక నిర్వహణకు వార్షిక కార్యాచరణ క్యాలెండర్, ప్రణాళికలపై కమిటీ సభ్యులతో కలెక్టర్ చర్చించారు. లైన్ డిపార్టుమెంట్లు సహకార సంఘాలను భాగస్వామ్యం చేయడం ద్వారా వివిధ కార్యకలాపాలను సజావుగా నిర్వహించడంలో సమన్వయం పాటించాలన్నారు. ఈనెలలో పీఏసీఏస్ ల డిజిటలైజేషన్‌పై ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో వర్క్‌షాపు నిర్వహణ, మార్చిలో సహకార సంఘాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఏప్రిల్‌లో హెల్త్‌క్యాంపుల ఏర్పాటు, సహకార సంఘాల్లో మహిళల పాత్ర, మే నెలలో పీఏసీఏస్‌లకు శిక్షణ, జూన్‌లో చేనేత సహకార సంఘాలకు, జూలైలో మత్స్యకార సహకార సంఘాల వర్క్‌షాపు, ఆగస్టులో జిల్లా కోఆపరేటివ్ సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక చేకూర్పు, సెప్టెంబరులో యువతకు అవగాహన, అక్టోబరులో డీసీఎంఎస్ పాత్రపై వర్క్‌షాపు, నవంబరులో అర్బన్ బ్యాంకుల ఉద్యోగుల క్రెడిట్ సొసైటీలు అందిస్తున్న సేవలపై సెమినార్, డిసెంబరులో డీసీసీబీ ఆధ్వర్యంలో సహకార సంఘాలకు కార్యశాల నిర్వహించే తదితర అంశాలపై కలెక్టర్ ఆమోదం తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా కోఆపరేటివ్ అధికారి టి.మురళీ, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీసీసీబీ సీఈవో నరసింహారావు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

కథలు, కార్టూన్లతో కిడ్స్ ప్యారడైజ్
అంబాజీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తొండవరం హైస్కూల్‌లో విద్యార్థులు నైతిక విలువలు బోధించే కథలు, ఆకట్టుకునే కార్టూన్లతో రూపొందించిన కిడ్స్ ప్యారడైజ్ రెండో సంచికను హెచ్ఎం పీవీ కేశవాచార్యులు సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్‌లో మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. నక్కా భావనశ్రీ, మల్లెపూడి శ్రీకుమార్, మద్దింశెట్టి లిఖిత, పేరాబత్తుల శ్రీధనలక్ష్మి, పెదమల్లు శ్రీమనస్విని, మణికంఠ, నిఖిల్, గీతిక, ధనశ్రీ, అహల్య, వర్షిత్ గెల్లినంజన, కేతా భాను, సిద్ధాబత్తుల స్వాతి, మధు, ఆదిత్య, నిఖిల్ తదితరులు రచనలు చేశారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

'ఏఆర్ డీఎస్పీ నుంచి రక్షణ కల్పించండి'
అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థలం రాసివ్వాలని జిల్లా ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్న యాకేఎల్ సుబ్బరాజు బలవంతం చేసి అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌లో నిర్బంధించినట్టు అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన సయ్యద్ అల్తాఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును కలిసి కుటుంబ సభ్యులతో తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ వినతిపత్రాన్ని అందించారు. ఏఆర్ డీఎస్పీ బారి నుంచి రక్షణ కల్పించాలని వేడుకున్నారు. కామనగరువు పంచాయతీ పరిధిలోని మేధా గార్డెన్స్‌లో 2014లో చింతపల్లి ప్రసాద్ అనే ఏజెంట్ ద్వారా నాలుగు సెంట్ల స్థలాన్ని కొనిపించి అదే సంవత్సరంలో ప్రస్తుతం కోనసీమ జిల్లా ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్న సుబ్బరాజుకు అమ్మించారు. పదేళ్ల అనంతరం ఏఆర్ డీఎస్పీ 'మీరు అమ్మిన స్థలం అక్కడ లేదు. ఇక్కడకు వచ్చి చూపించండని డిమాండ్ చేశారు. చింతపల్లి ప్రసాద్ అనే వ్యక్తి ఆ స్థలాన్ని విక్రయించినట్టు చెప్పినా పట్టించుకోలేదు. నీకున్న స్థలంలో నాలుగు సెంట్లు స్థలం ముందు నాకు రిజిస్ట్రేషన్ చెయ్యి. ఆ తరువాత కూర్చొని మాట్లాడుకుందాం అని బలవంతం చేసినట్టు వివరించారు. 'నన్ను తాలూకా పోలీసుస్టేషన్‌లో నిర్బంధించిన సంగతిని తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చారు. వారితో కనీసం మాట్లాడే అవకాశం కూడా కల్పించలేదు. జీప్‌లో ఎక్కించుకుని ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు' అని వివరించాడు. కుటుంబ సభ్యులను కూడా చంపేస్తామని బెదిరించినట్టు ఎస్పీకి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈవ్యవహారాన్ని దర్యాప్తు చేయాలని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌ను ఎస్పీ ఆదేశించారు. ఈవిషయమై వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే అన్ని వివరాలు చెబుతామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
అంబాజీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఒక వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ముక్కామల సినిమారోడ్డుకు చెందిన నేదునూరి వెంకటేశ్వరరావు(62) ఈనెల8న డాబా మెట్లు ఎక్కుతుండగా జారి పడి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు సోమవారం మృతి చెందిదాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ప్రసాద్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



అమలాపురంటౌన్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పూర్వవిద్యార్థులు సోమవారం తిరిగి అదే చదువులమ్మ చెట్టు నీడన కలుసుకున్నారు. వృత్తి, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డ మిత్రులంతా కలుసుకుని ఒకరికొకరు ఆలింగనం చేసుకుని తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 20ఏళ్లనాటి విద్యార్థులను చూసి ఉపాధ్యాయులు ఎంతో ఆనందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. పూర్వవిద్యార్థుల వాట్సాప్ గ్రూపును ఏర్పాటుచేసి అందరికీ పరిచయం చేశారు. ఈసమ్మేళనానికి నిర్వాహకులుగా శ్రీదేవి, మహాలక్ష్మి, కల్యాణి, ప్రసన్న వ్యవహరించారు.

లక్ష్యాన్ని సాధించాలి
ముమ్మిడివరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పన్నులు సకాలంలో వసూలుచేసి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆర్ఐ, ఎడ్మిన్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఎడ్వైటైజ్మెంట్, ఖాళీస్థలాలు, ఆక్రమణలు, ట్రేడ్‌లైసెన్సు పన్నులను సకాలంలో వసూలు చేయాలన్నారు. నగరపంచాయతీ పరిధిలో ప్రోపర్టీ యాక్టు రూ.1.56కోట్లకు ఇప్పటివరకు రూ.1.03కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు. మెప్మా విభాగంలో ఆర్పీగా పనిచేస్తూ మృతిచెందిన మాదేటి రామలక్ష్మికి సంతాపం తెలిపారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆర్ఐ భాస్కరరావు, ఏడు సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, కోర్డినేటర్ రాజేశ్వరి, ఆర్పీలు పాల్గొన్నారు.

డీడీవోగా తహశీల్దార్‌నే కొనసాగించాలి
పి.గన్నవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రేడ్ 1,2 వీఆర్వోలకు సెలవులు మంజూరు, సర్వీసు రిజిష్టరు మెయింటినెన్స్ వంటి అధికా రాలు తహశీల్దార్‌కు కేటాయించి, జీతభ త్యాలు విషయంలో గ్రేడ్-1 వీఆర్వోలకు తహ శీల్దార్ డీడీవోగా వ్యవహరిస్తున్నారని వీఆర్వోలు పేర్కొన్నారు. జీతభత్యాలు విషయంలో గ్రేడ్-2 వీఆర్వోలకు ఆయా పంచాయతీ కార్యదర్శులు డీడీవోగా వ్యవహరిస్తున్నారని తెలిపా రు. ఇరు శాఖల మధ్య సమన్వయం కొరవ డుతుందని, గ్రేడ్-2 వీర్వోలకు కూడా డీడీవోగా తహశీల్దార్‌నే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు తహశీల్దార్ పి.శ్రీపల్లవికి వినతిపత్రం అందించారు. పి.నరసింహరావు, కె.దొరబాబు, కె.భగవన్నారాయణ, రత్నకుమారి, సహచర వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి
యానాం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): యానాం శివారు దరియాలతిప్పలో సాగునీరందక పంట పొలాలు నాశనం ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వారం రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనీస స్పందన లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో రైతులు స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను కలిశారు. దీంతో ఆయన పరిపాలనాధికారి కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి రైతుల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశిం చారు. అవసరమైతే రైతులు కూడా అధికారులతో కలిసి పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నరాని, నిర్లక్ష్యం చేయకుండా రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశారు జారీ చేశారు. కార్యక్రమంలో రైతులు తిరుకోటి భైరవమూర్తి, కొరుకొండ ఆనందరావు, సబ్బతి రాంబాబు, మోర్త శ్రీను, మట్టా రాంబాబు, గిడ్ల వెంకన్న, వాకపల్లి వేంకటేశ్వరరావు, పాము అధిమూర్తి, సూర్యం లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో నూతన విగ్రహాల పునఃప్రతిష్ఠ



మలికిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మలికిపురంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం నూతన విగ్రహ, మందిర పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. త్రయాహ్నిక దీక్షతో నిర్వహించిన కార్యక్రమంలో స్థలదాత గోపరాజు జవహర్‌లాల్-శివజ్యోతి దంపతులతో ప్రతిష్ఠ జరిగింది. ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహించారు.

సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠ



అయినవిల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): క్రాపపాలెం గ్రామంలో నూతనంగా పునఃనిర్మించిన ఆలయంలో శ్రీహనుమత్ సీతా, లక్ష్మణ, భరత, శత్రుఘ్న వశిష్ఠ సపరివార సమేత శ్రీపట్టాభిరామస్వామి శిలా విగ్రహ ప్రతిష్ఠ, లక్ష్మీగణపతి, దత్తాత్రేయస్వామివార్ల ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. త్రిషణ స్నానం, పూర్ణాహుతి, రత్నన్యాసం, ప్రతిష్ఠలు, గోదృష్టి, కళావాహన, శాంతి కల్యాణం, ఆశీస్సు పండిత సత్కారం నిర్వహించారు. శ్రీకోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో భారీగా అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా వీరభద్రుని సంబరం
అయినవిల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలంకలో వేంచేసి ఉన్న శ్రీవీరభద్రుని సంబరం వైభవంగా నిర్వహించారు. సోమవారం శ్రీవీరభద్రుని బోణాల ఊరేగింపు, స్వామివారికి గోదావరిలో చక్రస్నానం, విఘ్నేశ్వరపూజ, వీరభద్రునికి పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజ, జమ్మిజెట్టు పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాజపర్తి వెంకటేశ్వర్లు దేవర ఆధ్వర్యంలో వీరభద్రునికి పూజలు జరిపించారు. కార్యక్రమంలో పోలిశెట్టి రంగనాయకులు, ర్యాలి శ్రీనివాస్, బద్రి శ్రీనివాస్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత
అంబాజీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కామల సబ్‌స్టేషన్ పరిధిలోని ఇరుసుమండ, పుల్లేటికుర్రు, కేవీ లంక, వక్కలంక, పసుపల్లి, చిన లంక, చిరతపూడి, మోడేకుర్రు గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.రాంబాబు తెలిపారు.

బీజేపీ కార్యాలయానికి స్థల విరాళం
మలికిపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ బీజేపీ కార్యాలయం నిర్మాణం కోసం చింతలమోరికి చెందిన బీజేపీ నాయకులు, ఎఫ్‌సీఐ మెంబరు దొడ్డా నాగబాబు రూ.10లక్షల విలువైన రెండు సెంట్ల స్థలాన్ని మలికిపురంలో బీజేపీ నాయకుల సమక్షంలో వితరణ ప్రకటించారు. మలికిపురం తహశీల్దార్ కార్యాలయానికి సమీపంలో రోడ్డు పక్కన స్థలాన్ని ఇస్తున్నట్టు ప్రకటించడంతో బీజేపీ నాయకులు హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, మాజీ ఎమ్మెల్యే ఎంఎ వేమా, అడబాల రాంబాబు, మేడిచర్ల చాణక్య తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు
పి.గన్నవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ యోజనలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వ టహించారు. అనంతరం వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగాతఃశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టిక ఆహారం అందించారు. సూప రింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావు, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, హెడ్‌నర్సు కుమారి, నల్లా పెద్దకాపు, తోలేటి సుబ్బారావు, బొక్కా వెంకటరాము, కొర్లపాటి సూరిబాబు, తోలేటి సాయిబాబు, గుర్రం వీరబాబు, కొమ్ముల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.3.29లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,29,870 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం: ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఏలూరుకు చెందిన సత్తి పూర్ణ చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు రూ.2,01,000 విరాళం ఇచ్చారు. దాతలకు ఈవో స్వామి వారి చిత్రపటం అందించారు.



చింతలూరు వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

17 నుంచి చింతలూరు వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆలమూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చింతలూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 22 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం బ్రహ్మోత్సవ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను విలేకరుల సమావేశంలో వారు తెలిపారు. ఈనెల 17న ఉదయం 5 గంటలలకు స్వామి వారి సుప్రభాతం, తోమాలసేవ, కొలువు 8గంటలకు పవిత్రోత్సవం సాయంత్రం 4 గంటల నుంచి శేషవాహనంపై ఊరేగింపు జరుగుతాయని వారు తెలిపారు. 18న గరుడ వాహనం, 19న గజవాహనం, 20న హనుమద్ వాహనం, 21న కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపులు జరుగుతాయన్నారు. ఆరు రోజులపాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుప్రభాతసేవ, తోమాల సేవ, లఘు అర్చన, బ్రహ్మోత్సవ సంకల్పం, స్వస్తి వాచకం తదితర సేవలు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఉత్తమ గుర్తింపు

మండపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గ్రేడ్ బిగుర్తింపు వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ కేటీటీవీ శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కళాశాల అధ్యాపకులతో కలిసి మాట్లాడారు. తమ కళాశాలకు 2016లో నాక్ గుర్తింపు దక్కిందన్నారు. ఇప్పుడు చాలాకాలం తర్వాత తిరిగి బీగ్రేడ్‌లో 2.33 పాయింట్‌లు సాధించి బిగ్రేడ్ సాధించామన్నారు. తమ కళాశాలను నాక్ బృందం సభ్యులు పరిశీలించిన అనంతరం గ్రేడ్ దక్కటం ఆనందంగా ఉందన్నారు. తమ కళాశాలలో కొంత కాలం కళాశాల రికార్డులు లేకపోవటం వల్ల మూడేళ్లకు సంబంధించిన ప్రగతిని సమర్పించడం వల్ల తమకు గ్రేడ్‌లో మార్కులు, పర్సంటేజ్ తగ్గిందని కళాశాల అధ్యాపకుడు కిరణ్ అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో పీజీ ఎంఎస్సీ, ఎంకామ్ కోర్సులను ప్రారంభించే యోచనలో వున్నామని తెలిపారు. త్వరలో తమ కళాశాల అటానమస్ అర్హత సాధిం చేలా ప్రయత్నిస్తున్నామన్నారు. సమావేశంలో లెక్చరర్‌లు కిరణ్ ఆనంద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులు, న్యాయవాదులు సత్సంబంధాలు కలిగి ఉండాలి



జిల్లా కోర్టు న్యాయమూర్తి శంకరరావుకు స్వాగతం పలుకుతున్న మురళి, సాయిప్రసాద్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): న్యాయమూర్తులు, న్యాయవాదులు సత్సంబంధాలు కలిగి ఉండాలని రామచంద్రపురం 13వ జిల్లా అదనపు, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.శంకరరావు అన్నారు. సోమవారం ఆయన రామచంద్రపురం 13వ అదనపు జిల్లా, సెషన్స్‌కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ హాలులో స్వాగత సమావేశం జరిపారు. సమావేశంలో న్యాయమూర్తి ఎం.శంకరరావు న్యాయవాదులను పరిచయం చేసుకుని మాట్లాడారు. అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శంకరరావుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్ మొక్కను అందచేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గం, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



రామచంద్రపురం నియోజకవర్గ యాదవ సంఘం నూతన కార్యవర్గం

యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గ యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సోమవారం రామచంద్రపురం నియోజకవర్గ యాదవ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆవల శ్రీను, ఉపాధ్యక్షుడిగా కానుబోయిన వీరబాబు, సంయుక్త కార్యదర్శిగా ఎ.శ్రీనివాసరావు, కోశాధికారిగా గోవాల మణికంఠ, సభ్యులుగా మల్లిపూడి రామకృష్ణ, పతీల శబరినాథ్, వి.శివాజీ, మందాల వెంకట రమణ, కె.శ్రీనివాసరావు, పోలోతు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.



మండపేటలో సోమవారం తెల్లవారుజామున పొగమంచు ఇలా కమ్మేసింది. ఉదయం 8 గంటల వరకు మంచు దుప్పటి పోలేదు. పొగమంచు కారణంగా రైతులు, వాహనదారులు ఇబ్బందులుపడ్డారు (మండపేట, ఆంధ్రజ్యోతి)

25వేల మందికి లక్ష్మీనరసింహుడి దర్శనం


అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘశుద్ధ త్రయోదశి ఏడో రోజు సోమవారం ఆలయంలో విశిష్ట అభిషేకాలు నిర్వహించినట్టు అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. అమలాపురంలో ఆమె మాట్లాడుతూ ఏడో రోజు స్వామివారిని 25వేల మంది భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారన్నారు. సోమవారం సాయంత్రం హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఫౌండేషన్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహుదూర్, ఉత్సవ సేవాకమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో నేడు భీమేశ్వరస్వామివారి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ డివిజనల్ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. నేటి ఉదయం 8.30 నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.



ఆత్రేయపురం పీహెచ్‌సీలో నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో వెంకటరామన్



ఆలమూరులో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందు వేస్తున్న వైద్యులు



అంగర సిద్ధార్థ కళాశాలలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ రమణ

ఆరోగ్యంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

• నులి పురుగుల అవగాహన సదస్సులో వక్తలు
• విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసిన వైద్యులు

కొత్తపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల, హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నులి పురుగుల అవగాహన సదస్సు జరిపారు. అనంతరం వారికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం, ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం జాతీయ నులిపురుగు నిర్మూలనలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ హైస్కూల్‌లో ఎంపీడీవో వెంకటరామన్, ఎంఈవో ప్రసాదరావు, వైద్యాధికారిణి సౌమ్య ఆధ్వర్యంలో పిల్లలకు మాత్రలు మింగించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలతో సాధ్యమని రాయవరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అనిరుధ్ తెలిపారు. సోమవారం రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేశారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీ పరిధిలో 11,845 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో వై.సూర్యనారాయణ, డాక్టర్ కె.మణికంఠ, బి.రమ్యశ్రీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారిణి డాక్టర్ ప్రసన్న

ఆలమూరు(ఆంధ్ర జ్యోతి): నులి పురుగుల నివారణ అవగాహనతో అధిగమించితే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిశోర్ అన్నారు. ఆలమూరు మండలం పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో చిన్నారులకు డివార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీడీవో రాజు, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిశోర్ అందించారు. ఆలమూరు మండలంలో 12,139 మందికి డీవార్మింగ్ మందులు అందించాలని నిర్ణయించగా సోమవారం 11,672 మందికి వాటిని పంపిణీ చేసినట్టు వైద్యులు తెలిపారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా అంగర, అచ్యుతాపురం పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం, చేతులను శుభ్రపరుచుకునే విధానం తదితర అంశాలపై విద్యార్థులు, చిన్నారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, సీహెచ్ గోపాలకృష్ణ, ఎంపీహెచ్‌ఎస్‌లు రామారావు, శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ, ఆశా, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వెల్ల పీహెచ్‌సీ పరిధిలో 94 శాతం మందికి, ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో 95 శాతం మంది పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశామని డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్‌కిశోర్ తెలిపారు. వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధితో పాటు రామచంద్రపురంలోని పిల్లలకు వాటిని మింగించామని తెలిపారు. వెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.



జనార్దనస్వామి ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన జనార్దనస్వామి రథోత్సవం

మండపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) మండపేటలోనున్న జనార్దనస్వామి రథోత్స వం ముగియటంతో సోమవారం కలువ పువ్వు సెంటరు నుంచి రథంగుడి వద్ద వున్న రథశాలకు రథాన్ని చేర్చారు. సోమవారం ఆలయంలో స్వామివారికి నిత్య హోమం, బలిహరణ, సదస్యం వేద పండితులు నిర్వ హించారు. మంగళవారం స్వామివారికి ఉద యం నిత్య బలిహోమం, రాత్రికి చోరోత్సవం నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణ అధి కారి కామేశ్వర రావు, ఆలయ ప్రధాన అర్చకు డు ఖండవల్లి గోపాల కృష్ణమాచార్యులు తెలిపారు.



రాజరాజేశ్వరస్వామి ఆలయానికి విరాళం ఇస్తున్న దృశ్యం

రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఎన్‌ఆర్‌ఐ విరాళం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం గ్రామంలోనున్న బాలత్రిపుర సుందరి రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వేగేశ్న ఛారిటబుల్ ట్రస్టు ఎన్‌ఆర్‌ఐ వేగేశ్న రామకృష్ణంరాజు సోమవారం రూ.50 వేలు విరాళాన్ని ఈవో నరేంద్రకుమార్‌కు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ట్రస్టు ప్రతినిధులు రుద్రరాజు విజయలక్ష్మి, వేగేశ్న ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బర్లంకలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గోదావరి లంకలో సోమవారం సీఐ కె. కాత్యాయని ఆధ్వర్యంలో దాడులు జరిపారు. గోదావరిలంకలో సారాకు వినియోగించే 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో బెల్ట్ షాపుపై దాడిచేసి 10 బ్రాందీ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆత్రేయపురం పోలీస్ ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.



వాహనశ్రేణికి జెండా ఊపుతున్న వాసంశెట్టి సత్యం తదితరులు

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల గెలుపు ఖాయం'

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు ఖాయమని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయం నుంచి భారీ సంఖ్యలో ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్‌కు నాయకులు, కార్యకర్తలతో మంత్రి వెళ్లారు. ఏలూరు నామినేషన్ కార్యక్రమానికి వెళుతున్న వాహన శ్రేణికి మంత్రి సుభాష్ తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, గుణ్ణం వినోద్‌కుమార్, విత్తనాల వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, కొసనా శ్రీనివాసరావు, రవ్వా భూషణం, సుంకర చిన కాపు, జాస్తి విజయలక్ష్మి, బల్ల లక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి స్వాగతం

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): ఏలూరులో నామినేషన్ వేసేందుకు వెళుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు రావులపాలెంలో ఘనస్వాగతం పలికారు. జాతీయ రహదారి సెంటర్‌లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, వాసిరెడ్డి రాంబాబు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కొత్తపేట నియోజకవర్గ కూటమి నాయకులతో కలిసి ర్యాలీగా ఏలూరు వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, పాలూరి సత్యానందంతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

మండపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం సోమవారం నామినేషన్ వేసేందుకు వెళుతున్న నేపథ్యంలో మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ శ్రేణులు, స్వాగతం పలికారు. కాకినాడ నుంచి బయలుదేరిన ర్యాలీ మండపేట మీదుగా సాగింది. ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మంత్రి సుభాష్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బల్లల పండుగ సందర్భంగా ఆకట్టుకున్న శక్తివేషాలు

ఘనంగా రజకుల బల్లల పండుగ

రాయవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో రజకుల బల్లల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాఘమాసంలో దీన్ని జరపడం ఆనవాయిగా వస్తున్నది. రజకుల కుల దైవమైన పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. బోణం సందర్భంగా గ్రామంలో వీరభద్రుడికి గ్రామోత్సవం నిర్వహించారు. బల్లల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి, కాంతార వేషాలు, పలు దేవతామూర్తుల వేషాలతో జరిపి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రజక చెరువు వద్ద బల్లల పూజలు భక్తి శ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో రజక సంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చను వీక్షించిన విద్యార్థులు

కొత్తపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని మోదీ మాట్లాడిన పరీక్షా పే చర్చ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని ఎంఈవో ఎం.హరిప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చూపించారు. ప్రధాని మోదీ ఇచ్చే సూచనలను విద్యార్థులకు అర్థమయ్యేలా తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యాయామం, క్రీడలు, యోగా, జ్ఞానం చేయడం ద్వారా పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యం వైపు దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు హరిప్రసాద్, కె.లీలావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రధాని మోదీ పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని లైవ్‌లో చూపిస్తున్న దృశ్యం



భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకున్న న్యాయమూర్తి దంపతులు

భీమేశ్వరాలయంలో జిల్లా అదనపు న్యాయమూర్తి పూజలు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సోమవారం రామచంద్రపురం అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.శంకరరావు సతీ సమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనం అనంతరం బేడా మండపంలో వేదపండితుల ఆశీర్వచనం పొందారు. ఆలయ సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావు స్వామి వారి ప్రసాదాన్ని వారికి అందించారు.

ఖండేశ్వరస్వామి ఆలయంలో పండిత సదస్యం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పడమరఖండ్రికలోని కండేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పండిత సదస్యం నిర్వహించారు. కొమాళ్లపల్లి శ్రీనివాసరాంగోపాల్ బ్రహ్మత్వంలో శ్రీకంఠం అమ్మన్న పంతులు ఆధ్వర్యంలో నిత్యహోమాలు, బలిహరణ, రాత్రి సదస్యం, పండిత సత్కారాలు తదితర పూజలను వేదమంతాల మధ్య జరిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాయాబజార్ నాటక ప్రదర్శన

అంతర్వేది, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉత్సవ సేవా కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ దిరిశాల బాలాజీ పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక భక్తి గీతాలాపనలు, వినూత్న నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం రాత్రి 8గంటలకు సురభి వారిచే మాయాబజార్ నాటక ప్రదర్శన అద్భుతంగా నిర్వహించారు. కళాకారులు కళాత్మకమైన వేషధారణల్లో వివిధసెట్టింగుల్లో పూర్వకాలపు ఆకృతులను ఆచార సంప్రదాయాలను నేటి సమాజానికి తెలియచేస్తూ నాటిక ప్రదర్శించడం ఆకర్షించింది. కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాయాబజార్ నాటకాన్ని తిలకించారు.ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తినాని, గుబ్బల ఫణికుమార్, భైరా నాగరాజు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు

విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు

అంబాజీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కోటివారి అగ్రహారంలో వేం చేసియున్న శ్రీభువనేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.